విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 20, జూలై 2024

రైతు సంఘం రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

విశాలాంధ్ర - నంద్యాల : మదనపల్లిలో జరిగే రైతు సంఘం రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండని రైతు సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి జి. సోమన్న కోరారు. రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం శుక్రవారం నంద్యాల సీపీఐ కార్యాలయంలో రైతు సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి జి.సోమన్న, జిల్లా రైతు సంఘం ఇన్చార్జి కె.భాస్కర్‌లు తెలియజేశారు. ఈ సమావేశానికి పి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జి.సోమన్న మాట్లాడుతూ ఈ నెల 29, 30, 31 తేదీలలో అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగే రైతు సంఘం రాష్ట్ర స్థాయి నిర్మాణ శిక్షణ సదస్సుకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో హాజరై రాష్ట్ర నాయకులు హాజరు కావాలని కోరారు. రైతాంగ సమస్యల మీద నిరంతరం స్పందిస్తూ రైతు సంఘం బలోపేదానికి కృషి చేయాలన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సుబ్బారెడ్డి, ఇమ్రాన్, గురుమూర్తి, కృష్ణ, మద్దిలేటి, సుధాకర్, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

నందమూరి నగర్ సమస్యలు పరిష్కరించండి : సీపీఐ

విశాలాంధ్ర-నంద్యాల అర్బన్: ఎన్ని ప్రభుత్వాలు మారినా నందమూరి నగర్‌లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐ నాయకులు కోరారు. నంద్యాల పట్టణ శివారు ప్రాంతమైన నందమూరి నగర్‌లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను సిపిఐ నందమూరి నగర్ శాఖ ఆధ్వర్యంలో సిపిఐ పట్టణ కార్య దర్శి కె.ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.ధనుంజయ్, నందమూరి నగర్ సిపిఐ శాఖ కార్యదర్శి హుస్సేన్, రహిమాన్, నాయక్‌లు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ నందమూరి నగర్ ఏర్పడి 40 ఏళ్లయినా ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారులు, కౌన్సిలర్లు వచ్చిన ఇక్కడ మౌలిక వసతులు శూన్యం అన్నారు. 1983లో నంద్యాల పట్టణంలోని పాత పట్టణంలోని 4 వార్డులలో గుడిసెలు అగ్నికి ఆహుతి కావడంతో అప్పటి టిడిపి ప్రభుత్వంలో ఫరూక్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆ ప్రాంత వాసులకు నంద్యాల పట్టణ శివారు ప్రాంతంలో అప్పటి ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు పేరు ఈ ప్రాంతానికి నామ కరణం చేసి నివాసాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదు అన్నారు. ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం చేస్తూ ఉంటే ఏమాత్రం ఈ ప్రాంతంపైన దృష్టి పెట్టకపోవడం దుర్మార్గమని అన్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు రహదారులలో, ఖాళీ స్థలాలలో నిలచిన వర్షపు నీటిని తొలగించి, దోమలు వృద్ధి చెందకుండా పాగింగ్ చేసి పరిశుభ్రంగా ఉంచాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జమాల్సా, ఫకీర్ సా, రిమున్ హుస్సేన్ బీ, హసీనా, పాహింస తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్టళ్ల సందర్శన

విశాలాంధ్ర-నంద్యాల అర్బన్: ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జులై 20 నుంచి 30 వరకు ప్రభుత్వ హాస్టల్లను సందర్శిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ్, జిల్లా కోశాధికారి సురేష్ తెలిపారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ్, జిల్లా కోశాధికారి సురేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల హాస్టల్ల విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడానికి సమస్యల పరిష్కారం కొరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జులై 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సందర్శిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాలలోని హాస్టల్ విద్యార్థుల దగ్గర నుండి సమస్యలను సేకరించి వాటి పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రభుత్వ హాస్టల్స్ మూతపడ్డాయని, మూతబడిన హాస్టళ్లను వెంటనే తెరవాలని డిమాండ్ చేశారు. చాలా హాస్టల్స్ శిథిలావస్థలోకి చేరాయి వాటి మరమ్మతులు చేయాలని, పూర్తిగా పాడుబడిన హాస్టల్లకు నూతన భవనాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ హాస్టల్లో చదువుతున్నటువంటి విద్యార్థులకు మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు తరుణ్, సిద్ధూ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ

విశాలాంధ్ర - బనగానపల్లె: పట్టణ శివారులోని ఏపీ మోడల్ స్కూల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఇన్చార్జి ఎంపీడీవో నాగరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వాహకులకు పలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఎంఈఓ స్వరూప, ఎంఈఓ-2 శ్రీనివాసులు పాల్గొన్నారు.

శిల్పా కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ శిల్పా కళాకారుల సమస్యలను పరిష్కరిస్తామని, శిల్ప కళాకారుల అభివృద్ధికి తాను ఎల్లప్పుడు తోడుంటానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. పట్టణంలోని ఆమె స్వగృహంలో ఆళ్లగడ్డ శిల్పా కళాకారులు శుక్రవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శిల్పకళాకారులకు ఎన్నికల ముందు తాను ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. రోడ్డుకు ఇరువైపులా శిల్ప కళామందిరాలు ఎక్కువగా ఉండడం వలన ఇరువైపులా శిల్పకళా నగర్ అని ఆర్చీలు ఏర్పాటు చేస్తామన్నారు. శిల్పాలు చేయడానికి రాయి రవాణా ఖర్చులు ఎక్కువగా వస్తున్నాయని శిల్పులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, రవాణాపై అసెంబ్లీలో మాట్లాడి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆళ్లగడ్డలో శిల్ప కళాకారుల కోసం మంత్రులతో మాట్లాడి కమ్యూనిటీ హాలు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. రెండు రాష్ట్రాల్లో శిల్పాలంటే గుర్తుకు వచ్చేది ఆళ్లగడ్డ అని ఆళ్లగడ్డ శిల్ప కళాకారుల గురించి అసెంబ్లీలో చర్చించి శిల్పులు అందరికీ ఐడి కార్డ్స్ ఇప్పిస్తానన్నారు. తద్వారా శిల్పులు అందరూ కమిటీ లాగా ఏర్పాటు చేసి, శిల్ప కళాకారుల అభివృద్ధికి తానెప్పుడూ తోడుగా ఉంటానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ స్పష్టం చేశారు.

విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - చాగలమర్రి: ఎడతెరిపిలేని వర్షాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సరఫరా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఏఈ షాజహాన్ సూచించారు. శుక్రవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తడి చేతులతో విద్యుత్తు తీగలను, స్తంభాలను తాకరాదని ఇంట్లో కరెంటు సరఫరా చేయడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు వ్రేలాడుతుంటే వెంటనే కరెంట్ ఆఫీస్‌లో తెలియజేయాలన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై వైద్యుల పరిశీలన

విశాలాంధ్ర - వెలుగోడు: కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమాన్ని వేల్పనూరు పీహెచ్సీ వైద్యులు డాక్టర్ జహీర్ వలి, డాక్టర్ ప్రణీతులు శుక్రవారం ఒకటో సచివాలయం పరిధిలో పరిశీలన చేశారు. వేల్పనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కుష్టు వ్యాధి నివారణపై ఆశా వర్కర్లు ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రజలు స్పర్శ లేని మచ్చలు ఉన్న యెడల ఆశా వర్కర్లకు తెలియజేసి కుష్టు వ్యాధి నివారణకు సహకరించాలని వైద్యులు కోరారు. ఎంపీహెచ్ఈఓ, పంచాయతీ సెక్రెటరీ, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గురు పౌర్ణమి వేడుకలు వాయిదా..

విశాలాంధ్ర-అవుకు: ఈ నెల 21వ తేదీన జరగాల్సిన గురు పౌర్ణమి వేడుకలను వాయిదా వేస్తున్నట్లు శ్రీ షిరిడి సాయి సేవా సమితి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 21వ తేదీ ఆదివారము గురు పూర్ణిమ సందర్భంగా జరగవలసిన వేడుకలు, గ్రామోత్సవం, అన్నదాన కార్యక్రమాలను భారీ వర్ష సూచనతో వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ నెలలో దత్త జయంతి రోజున కార్యక్రమాలన్నీ కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్‌ను మళ్లించండి..

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: అదొక కూరగాయలు విక్రయించు ప్రదేశం. అక్కడ ప్రతి శుక్రవారం వారపు సంత నిర్వహిస్తారు. ఇక్కడ కురగాయాలు కొనడానికి ప్రజలు ఇతర గ్రామాలనుండి అధికంగా వస్తుంటారు. మండల కేంద్రంలో సంత బజారు చిన్నదిగా ఉండడం వలన ద్విచక్ర వాహన దారులు, ఆటోలు, కార్లు ఇదే రాస్తా ద్వారా పోతూ వస్తూ ఉండడం వలన దీంతో ఇక్కడికి కూరగాయలు కొనడానికి వస్తున్న ప్రజలకు, పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు ట్రాఫిక్ పెద్ద సమస్యగా మారిందని ప్రజలు వాపోతున్నారు. రాత్రి సమయంలో ఈ రోడ్డు వెంట భారీ వాహనాలు వెళ్లడంతో ప్రజలు భయాందోళనలకు గురి అవుతున్నారు. ఈ విషయమై సంబంధిత పంచాయితీ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం సూన్యమంటున్నారు. రోజు ఎలాగున్నా కనీసం వారపు సంత రోజు శుక్రవారం రోజైనా వాహనదారులను రస్తా ద్వారా మళ్లించాలని, వన్ వే ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను, పోలీస్ సిబ్బందిని కోరుకుంటున్నారు.

అభివృద్ధి పనులపై చర్చ..

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల రైల్వే స్టేషన్‌కి విచ్చేసిన రైల్వే డిఆర్ఎం రామకృష్ణతో నంద్యాల రైల్వే స్టేషన్ అభివృద్ధిపై పలు అంశాలు చర్చించడం జరిగిందని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాలలో రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా 30 అడుగుల రోడ్డును 40 అడుగులు చేయాలని డిఆర్ఎంను కోరడం జరిగిందని, అలాగే రైల్వే స్టేషన్లో పార్కింగ్, రైల్వే ట్రాక్ మొదలగు సమస్యలను పరిష్కరించి నంద్యాల రైల్వే స్టేషన్ అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. అనంతరం రైల్వే డిఆర్ఎం రామకృష్ణ మాట్లాడుతూ నంద్యాల రైల్వే స్టేషన్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామన్నారు.

రాష్ట్ర స్థాయి అండర్ 19 బాల బాలికల చదరంగం పోటీలు

విశాలాంధ్ర - నంద్యాల : పట్టణంలోని రామకృష్ణ పీజీ కాలేజీలో గత రెండు రోజులుగా జరిగిన అండర్ 19 బాల బాలికల పోటీలు నేటితో ముగిసాయని రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి.రామకృష్ణరెడ్డి తెలిపారు. టోర్నమెంట్ మొదటి బాలురు 4 స్థానాలు, బాలికలు 4 స్థానాలు, నేషనల్‌కి ఎంపికయారని టోర్నమెంట్ ఆర్గనైజర్ జి.రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లా డుతూ చదరంగం క్రీడ ఆడడం వలన మేధా శక్తి పెరుగుందన్నారు. ముఖ్య అతిధులుగా డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, భారతీయ క్రీడా భారతి సెక్రటరీ సుధాకర్, లయన్స్ క్లబ్ సెక్రటరి సిరిగిరి రమేష్, చీఫ్ ఆర్బిటర్ ఉదయ్ కుమార్ నాయుడు, అల్ కర్నూల్ చెస్ అసోసియేషన్ గోవింద్ జేయర్, టోర్నమెంట్ డైరెక్టర్ సుజాత, అర్బిటర్లు ఇమామ్, రవి నాయక్ పాల్గొన్నారు. బాలుర విభాగంలో అనంతపూర్ కు చెందిన కుశల్, గుంటూరుకు చెందిన ధ్రువీశ్, ఈస్ట్ గోదావరికి చెందిన మజ్జి రాంచరణ్ తేజ, నంద్యాల జిల్లాకు చెందిన హర్షవర్ధన్ ఆచారిలు, బాలికల విభాగంలో సర్వాణి చిదేళ్ల (ఎన్టీఆర్ జిల్లా), హిమాతేజేశ్విని (నెల్లూరు), జి.శ్రీహ (అనంతపూర్), కావ్యశ్రీ (ఈస్ట్ గోదావరి)లు విజేతలుగా నిలిచారన్నారు.

పలు సచివాలయాలు తనిఖీ..

విశాలాంధ్ర-అవుకు: మండలంలోని కునుకుంట్ల, ఉప్పలపాడు, కొండమనాయినిపల్లి సచివాలయాలను, కొండమ నాయన పల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మండల అభివృద్ధి అధికారి మల్ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. సచివాలయంలోని రికార్డులను, హాజరు పుస్తకాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసి అర్హత కలిగిన వారికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అన్నారు. కొండమ నాయునిపల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

21న జిల్లా స్థాయి యోగా పోటీలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని ఆవుల పుల్లారెడ్డి సేవాసమితి యోగ హాల్ నందు ఈనెల 21న ఆదివారం జిల్లా స్థాయి యోగ సబ్ జూనియర్, సీనియర్ బాల బాలికల, స్త్రీ పురుషుల విభాగంలో యోగ ఎంపిక పోటీలను నిర్వహిస్తు న్నట్లు నంద్యాల యోగ అస్సోసియేషన్ చైర్మెన్ ఆవుల విజయ భాస్కరెడ్డి, ప్రెసిడెంట్ బాలక్రిష్ణ, సెక్రటరీ హనుమంతురెడ్డి, ట్రెజరర్ సుదీప్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపిక పోటీలకు హాజరు అయ్యే క్రీడాకారులకు భోజన వసతి కల్పిస్తున్నట్టు ఆవుల విజయ భాస్కరెడ్డి తెలిపారు. ఎంపిక పోటీలకు వచ్చే క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు జిరాక్స్, స్కూల్ బోనఫైడ్ సర్టిఫికెట్, ఫొటోస్ తీసుకొని రావాలన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు విశాఖపట్నంలో జరగబోయే 49వ రాష్ట్రస్థాయి పోటీలకు నంద్యాల జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

ఆల్ ఇండియా స్థాయిలో బనగానపల్లె వాసి

విశాలాంధ్ర - బనగానపల్లె : అల్ ఇండియా శిటోరియు కరాటే యూనియన్ ఇండియా నుంచి 20 మంది బెస్ట్ కరాటే కోచెస్‌ని సెలెక్ట్ చేశారు. అందులో ఏపీ స్టేట్ నుంచి, జెన్ స్పోర్ట్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీ బనగానపల్లె కోచ్ సెన్సన్ డి.కళ్యాణ్ బాబు, ఏసియన్ ఫసిఫిక్ శిటోరియు కరాటే ఫెడరేషన్ సింగపూర్‌లో జరిగిన టెక్నికల్ సెమినార్ జులై 11,2024 నుంచి జులై 15,2024 వరకు జరిగిన సెమినార్ లో పాల్గొన్నారు. అక్కడ జపనీస్ మాస్టర్స్ సఖమోటో, ఇడో తో ట్రైనింగ్ తీసుకున్నారు. ఇండియాతో పాటు జపాన్, సింగపూర్, మలేషియా, హాంగకాంగ్, ఫిలిపిన్స్, శ్రీలంక, ఇండోనేసియా, ఆస్ట్రేలియా, దుబాయ్, వియత్నం నుంచి టెక్నికల్ సెమినార్ కి అటెండ్ అవ్వడం జరిగింది. దీనికి మన స్టేట్ కరాటే అసోసియేషన్ అఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ డాక్టర్. కె. ప్రతాప్ కుమార్ డి.కళ్యాణ్ బాబుని అభినందిస్తూ ఇంకా లైఫ్‌లో మంచి పొజిషన్‌కి వెళ్ళాలి అని బనగానపల్లె జెన్ స్పోర్ట్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీ స్టూడెంట్స్ స్టేట్స్, నేషనల్స్, ఇంటర్నేషనల్స్‌లో మెడల్స్ రావాలని బెస్ట్ విషెస్ తెలియజేశారు.

జనసేన పార్టీ సభ్యత్వ నమోదులో వాలంటీర్లు

విశాలాంధ్ర - నంద్యాల : జనసేన పార్టీ సభ్యత్వ నమోదు లో వాలంటీర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని జనసేన నాయకులు రాచమడుగు చందు, సుందర్‌లు పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయం నందు జనసేన పార్టీ సభ్యత్వ నమోదు క్రియాశీలక వాలంటీర్లతో జనసేన నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు రాచమడుగు చందు, సుందర్ లు మీడియా తో మాట్లాడుతూ జనసేన సభ్యత్వం ఈనెల 18వ తేదీ నుండి 28వ తేదీ వరకు కొనసాగుతుందని, ఇందులో ఐదు లక్షల రూపాయల వరకు ప్రమాద బీమా ఇన్సూరెన్స్, యాక్సిడెంట్ గురైతే రూ.50 వేలు ఖర్చులకు ఇవ్వబడు తుందన్నారు. ఈ సభ్యత్వం తీసుకోవడం వలన జనసేన పార్టీ యందు క్రియా శీలకంగా పని చేయడం జరుగుతుందన్నారు. జనసేన నాయ కులు దండు మురళి, గురుబాబు, నంద్యాల మండల జనసైనికులు పాల్గొన్నారు.

36.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

విశాలాంధ్ర-అవుకు: మండలంలోని అన్ని గ్రామాలలో గురువారం రాత్రి, శుక్రవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. వర్షం కోసం ఎదురుచూస్తున్న మండలంలోని కొండమీది గ్రామాలైన కొండమనాయన పల్లి, ఉప్పలపాడు, కునుకుంట్ల మరియు తండాలలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొండమీద గ్రామాలలో సాగు చేస్తున్న మినుము, మొక్కజొన్న, వరి పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని అన్నారు. గత కొద్దిరోజులుగా వర్షాలు లేక ఎదురుచూస్తున్న రైతాంగానికి రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. మండలంలో మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొంటున్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవనతో మెలగాలి

విశాలాంధ్ర - బనగానపల్లె: రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని టౌన్ సీఐ గంటా సుబ్బారావు హెచ్చరించారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఉన్నత అధికారుల ఉత్తర్వుల మేరకు రౌడీ షీటంలను పోలీస్ స్టేషన్‌కి పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీ షీటర్లు ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని హెచ్చరించారు.

బైరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

విశాలాంధ్ర - నందికొట్కూరు : పారుమంచాల గ్రామానికి చెందిన వైసిపి నాయకులు పోచ రాఘవరెడ్డి, స్వామి రెడ్డి, శంకర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం టిడిపి సీనియర్ నాయకులు నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో పట్టణంలోని ఆయన స్వగృహం నందు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పురపాలక సంఘం చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మృత దేహానికి నివాళ్లర్పించిన బీసీ ఇందిరమ్మ

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: మండల కేంద్రంలోని సంతపేట వీధిలో నివాస ముందు మహమ్మద్ రఫీ శుక్రవారం అనారోగ్యంతో మరణించడంతో విషయం తెలుసుకున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి భార్య బీసీ ఇందిరమ్మ మహమ్మద్ రఫీ భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. అనంతరం రఫీ కుమారుడు సాయిద్ బాషకు భరోసా కల్పించారు. నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలకు నాయకులకు ఎప్పుడైనా, ఏ అవసరం వచ్చినా వెంటనే ఆదుకోవడానికి ఉన్నామన్నారు. ఇందులో టీడీపీ ప్రధాన కార్యదర్శి గడ్డం రామకృష్ణ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మెన్ గడ్డం నాగేశ్వర్ రెడ్డి, యూత్ లీడర్ పేరా శ్రీధర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, మురళి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆర్యవైశ్యుల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారిని ఎమ్మెల్యే శుక్రవారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యే అమ్మవారిశాలకు చేరుకోగానే ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కొలువుదిరిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారిని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేను అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దేవిశెట్టి హరీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మండల వ్యాప్తంగా మోస్తారు వర్షం

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం మోస్తారు వర్షం కురిసింది. ఉదయము నుండి మెఘావృతమైనప్పటికీ సాయంత్రం చిరుజల్లులతో ప్రారంభమై వర్షం కురిసింది. గాలులు బలంగా వీస్తుండడంతో ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. కొలిమిగుండ్ల, పెట్నికోట, మీర్జాపురం, బెలూం, ఇటిక్యాల, కలవటాల, నందిపాడు, కనకాద్రి పల్లి తదితర గ్రామాలలో మోస్తరు వర్షం కురువగా మిగిలిన గ్రామాలలో చిరుజల్లులకే పరిమితమయ్యాయి.

గత 25 సంవత్సరాలుగా జిల్లాలో అత్యుత్తమ శిక్షణ ఇస్తున్న ఏకైక సంస్థ
బి.పి.ఆర్.ఆర్ మెమోరియల్ ఐటిఐ
(భారత ప్రభుత్వంచే గుర్తించబడిన సంస్థ)
నంద్యాల రోడ్డు, నందికొట్కూరు, నంద్యాల జిల్లా.
ట్రేడులు: ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్
విద్యార్హత : 10వ తరగతి ఉత్తీర్ణత
వయోపరిమితి : 14 సం॥ నుంచి 40 సం॥ వరకు
ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ :
కాల పరిమితి: 2 సంవత్సరాలు
డీజిల్ మెకానిక్ :
కాల పరిమితి: 1 సంవత్సరం
అడ్మిషన్లు జరుగుచున్నవి
సెల్ నెం. 9440551858
ప్రత్యేకతలు:
గత 25 సంవత్సరాలుగా అత్యాధునిక వసతులతో, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నడుపుతున్న విద్యా సంస్థ ● 100% ఉత్తీర్ణత
● బస్సుపాసు సౌకర్యం ● ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం ● ఇతరులకు గవర్నమెంట్ ఫీజులు మాత్రమే.

బి. రామకృష్ణా రెడ్డి
ప్రిన్సిపాల్ & కరస్పాండెంట్

చెంతనే నీరున్నా...‘చింతే’

- చివరి ఆయకట్టుకు నీరందక ఇబ్బందులు
- తెలుగు గంగ కాలువలకు మరమ్మత్తులు చేయాలి



విశాలాంధ్ర - చాగలమర్రి : జిల్లా రైతులకు సాగు నీరందించేందుకు తెలుగు గంగ, కేసీ కాలువలు ఉన్నా చివరి ఆయకట్టుకు నీరందడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పరిధిలో తెలుగు గంగ కాలువ కింద ఆళ్లగడ్డ నియోజకవర్గంలోనే అత్యధి కంగా 82 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. తెలుగు గంగ ప్రధాన కాలువకు, పంట కాలువలకు మరమ్మతులు చేపడుతున్నా రైతులకు మాత్రం నీరందని పరిస్థితి.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి : నియోజకవర్గంలో గాజులపల్లె సమీపం నుంచి తెలుగు గంగ కాలువ మొదటి ప్రధాన కాలువ 13వ బ్లాక్ గాజులపల్లె నుంచి 20 బ్లాక్ వరకు నంద్యాల డివిజన్ పరిధిలోకి ప్రవహిస్తుంది. 21వ బ్లాకు నుంచి 37వ బ్లాకు వరకు ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలోకి వస్తుంది. ప్రధాన కాలువ 58వ కిలో మీటరు నుంచి 96వ కిలో మీటరు వాగలమర్రి మండలంలోని చిన్నవంగలితో ముగిసి కడప జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం, ఆళ్లగడ్డ, శిరువెళ్ల, చాగలమర్రి మండలాల్లో దాదాపు 82 వేల ఎకరాల ఆయకట్టుకు వీరివ్వాల్సి ఉంది. ఏటా చివరి ఆయకట్టుకు వీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట కాలువలు అధ్వాన స్థితిలోనూ, బసంపూర్తిగానూ ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఏటా 14 టీఎంసీలు నీరు : తెలుగు గంగ ప్రధాన కాలువ నుంచి ఏటా 14 టీఎంసీల నీటిని తెలుగు గంగ ప్రధాన కాలువ నుంచి వైఎస్సార్ జిల్లా బ్రహ్మం సాగరుకు, అక్కడి నుంచి చెన్నైకి తాగునీటి అవసరాలకు తరలిస్తున్నారు. తెలుగు గంగ ప్రధాన కాలువ వెంట నీరు ప్రవహించే సమయంలోనే కాలువ వెంట ఉన్న ఆయకట్టు రైతులకు బ్లాకు గుండా పంట కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు.

రూ.8 కోట్లతో పనులు : గతేడాది చాగలమర్రి డివిజన్ పరిధిలో తెలుగు గంగ ప్రధాన కాలువ పంట కాలువల మరమ్మత్తులకు దాదాపు 45 పనులకు రూ.8కోట్లు ఖర్చు చేశారు. ప్రధాన కాలువ లైనింగ్ పంట కాలువలు, వాటి వెంట మొరుసు రహదారి పనులను చేపట్టారు. పూర్తిస్థాయిలో బాగవ్వకపోవడంతో ఏటా రైతులకు కన్నీరే మిగులుతోంది. మండలంలోని మూడురాళ్ళపల్లె, చాగలమర్రి, చిన్నవంగలి గ్రామాల పరిధిలో పంటకాలువలు అధ్వాన స్థితిలో ఉన్నాయి. అసంపూర్తిగా ఇవి మిగలడంతో చివరి ఆయకట్టు రైతులకు నీరంచడం లేదు. రుద్రవరం ఆళ్లగడ్డ శిరువెళ్ల మండలాల పరిధిలోనూ

బాగు చేయాల్సి ఉంది, పొలం తడవడంలేదు - షరీఫ్, రైతు, చాగలమర్రి : ఏటా తెలుగు గంగ ప్రధాన కాలువకు నీరు వస్తున్నా. తమ పొలం గుండా వెళ్లే పంట కాలువకు నీరు మాత్రం అందడం లేదు. చాగలమర్రి సమీపంలోని వాటికి నీరందక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు నీరందేలా చూడాలి.

నీరందేలా చూస్తాం - వెంకటరమణ, తెలుగు గంగ డీఈ : తెలుగు గంగ ఆయకట్టు రైతులకు నీరందేలా చూస్తాం. చివరి ఆయకట్టు రైతులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. అధ్వానస్థితిలో ఉన్న పంట కాలువల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులొచ్చిన వెంటనే వాటి బాగుకు ప్రయత్నిస్తాం.

మరిన్ని వార్తలు E-PAPERలో

23న జిల్లా కార్యవర్గం, 24న జిల్లా జనరల్ బాడీ సమావేశాలు

- సీపీఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య

విశాలాంధ్ర - కర్నూలు : సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం ఈ నెల 23న సీఆర్ భవన్, కర్నూలులో జరుగుతుందని, 24న జిల్లా జనరల్ బాడీ సమావేశం కర్నూలులోని లక్ష్మీ నర సింహస్వామి కళ్యాణ మండపం నందు జరుగు తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీవీ సత్య నారా యణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, పి.రామ చంద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆవుల శేఖర్, ఎన్.లెనిన్ బాబు పాల్గొంటారన్నారు. 23న కార్యవర్గ సభ్యులు, ఆహ్వానితులు హాజరుకావాలన్నారు. 24న జిల్లా జనరల్ బాడీ సమావేశంలో పార్టీ మండలాల కార్యదర్శులు, జిల్లా, మండల,పట్టణ స్థాయి ప్రజాసంఘాల నాయకులు, శాఖ కార్యదర్శులు,సహాయ కార్యదర్శులు హాజరై జయప్రదం చేయాలన్నారు. జిల్లా రాజకీయ పరిస్థితులు, జిల్లాలో పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజె క్టులు, జిల్లా సమగ్రాభివృద్ధి పై చర్చిస్తున్నట్లు ఆయన తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తాం

విశాలాంధ్ర - కర్నూలు క్రైం : శాంతిభద్రతల పరిరక్షణ లో పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తామని కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ స్పష్టం చేశారు.శుక్రవారం ఉదయం కర్నూలు రేంజ్ డిఐజి కార్యాలయంలో కర్నూలు రేంజ్ డిఐజి గా డాక్టర్ కోయ ప్రవీణ్ పదవీ బాధ్యతలు చేపట్టారు.ముందుగా ఎఆర్ పోలీసు సిబ్బందిచే డిఐజి గౌరవ వందనం స్వీకరించారు. పురోహితులు డిఐజికి ఆశీస్సులు అందజేశారు.అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కర్నూలు రేంజ్ డిఐజి గా రాయలసీమ కు రావడం ఇదే మొదటిసారి అని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ నిర్వహణకు కర్నూలు రేంజ్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ఒక టీమ్ వర్క్ గా పని చేస్తామని తెలిపారు.ప్రశాంత వాతావరణం కు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని అన్నారు.ప్రజలకు ఏల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు.

పెండింగ్ నీటి పారుదల ప్రాజెక్టుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం

- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : 2024-25 ఖరీఫ్ పంట కాలానికి తుంగ భద్ర డ్యాం నుండి 16 టిఎంసిల నీటి విని యోగానికి జిల్లా నీటిపారుదల సలహా మండలి ఆమోదం తెలిపింది. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వ హించిన నీటిపారుదల సలహా మండలి సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష, ఎమ్మెల్సీ మధుసూదన్, పాణ్యం శాసన సభ్యులు గౌరు చరిత, ఆదోని ఎమ్మెల్యే పార్థ సారథి, పత్తికొండ ఎమ్మెల్యే కెఈ శ్యామ్ బాబు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్త గిరి, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, కర్నూలు ఆర్డీఓ శేషి రెడ్డి, పత్తికొండ ఆర్డిఓ రామలక్ష్మి తది తరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పెండింగ్ లో ఉన్న నీటి పారుదల ప్రాజెక్టుల సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం అని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టీజీ భరత్ తెలిపారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా పెండింగ్ ప్రాజెక్టుల వివరాలను, వాటిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తీసుకోవలసిన చర్యలతో సమగ్ర నివేదికను ఇవ్వాలని ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డిని ఆదేశించారు. ఈ అంశంలో సంబంధిత నియోజకవర్గ ఎమ్మెల్యేల సలహాలను తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష మాట్లాడుతూ నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి టాప్ మోస్ట్ ప్రయారిటీగా చేయాల్సిన పనుల వివరాలు, మంజూరయ్యే పనులు జరుగుతున్న ప్రాజెక్టుల వివరాలు, త్రాగునీటికి సంబంధించి అవసరమైన ఎస్ ఎస్ ట్యాంకుల వివరాలు, ఎస్ ఎస్ ట్యాంకుల ఎక్స్టెన్షన్ పనుల వివరాలను ఎస్టిమేట్స్, ఖర్చు వివరాలతో నియోజక వర్గాల వారీగా రూపొందించి పంపాలని కలెక్టర్ ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించారు. పత్తికొండ నియోజక వర్గంలో 68 చెరువులకు నీటిని నింపే పనులకు సంబంధించి ఇప్పటివరకు ఎన్ని చెరువులకు నీటిని నింపారు, తదితర వివరాలను కలెక్టర్ ఇరిగేషన్ ఎస్ఈని అడిగి తెలుసుకున్నారు. ప్రతి 200, 300 ఎకరాలకు చిన్న ట్యాంకుల నిర్మాణాలు చేసుకొని హెచ్ ఎన్ ఎస్ ఎస్ నుండి నీరు నింపుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని కలెక్టర్ సూచించారు. గ్రామాల్లో చిన్న చిన్న ఫార్మ్ పాండ్స్ లేదా చెరువులనుతయారు చేసుకొని నీటిని స్టోర్ చేసుకోవాలనే ఆలోచన చేయాలన్నారు. ఇప్పటికైనా కెనాల్ మీదుగా ఉన్న గ్రామాల్లో ప్రభుత్వ భూమిని గుర్తించి వాటిలో ట్యాంక్లు, వాటర్ పాండ్స్ ఏర్పాటు చేసుకునే విధంగా సంబంధిత ఆర్డిఓలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పశ్చిమ ప్రాంతంలో ప్రాధాన్యత ఉన్న పనుల వివరాలను తన దృష్టికి తీసుకొని వెళ్తే వెంటనే చేసేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.. రాష్ట్ర ప్రభుత్వం వేదవతి ప్రాజెక్టు మీద కూడా ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు, 68 చెరువులు నింపే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. నియోజకవర్గంలోని కొత్తపల్లి రిజర్వాయర్పై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఓర్వకల్లు, కల్లూరు మండలంలోని చెరువులు కూడా నింపాలని అధికారులకు సూచించారు. ఆదోని ఎమ్మెల్యే పార్థ సారథి మాట్లాడుతూ ప్రతి విలేజ్లో ప్రభుత్వ భూమిలో చెరువులు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: ఓల్డ్ టౌన్ అంబేద్కర్ సర్కిల్ నుండి కింగ్ మార్కెట్ వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోనున్న యజమానులు సహకరించాలని డీసీసీ సంధ్యా కోరారు. శుక్రవారం నగరపాలక కౌన్సిల్ హాలులో రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోనున్న 89 మంది బాధితులతో సమావేశం నిర్వహించి, అభిప్రాయాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఏసిపిలు శశిలత, రంగస్వామి, సూపర్వైజర్లు శబ్రిష్, మంజులమ్మ, సూపరింటెండెంట్ సుబ్బన్న, జూనియర్ అసిస్టెంట్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - చిప్పగిరి: గ్రామీణ ప్రాంతాలలోని పరిసరాల పరిశుభ్రతపై ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని పత్తికొండ డిఎల్ పి ఓ ప్రకాష్ నాయుడు అన్నారు. మండల కేంద్రమైన చిప్పగిరి గ్రామ సచివాలయము నందు ఇంచార్జి ఈవోఆర్డి బాలన్న ఆధ్వర్యంలో గ్రామ పంచాయితీ కార్యదర్శిల సమావేశమును నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తికొండ డిఎల్పిఓ ప్రకాష్ నాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో రీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని గ్రామపంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉంటూ పారిశుద్ధంపై గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తూ సలహాలు సూచనలు తెలియజేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రమీల, సురేంద్రనాథ్, సిసింద్రీ, జయరాంనాయక్, సుధీర్, నరసింహులు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి

విశాలాంధ్ర -కర్నూలు సిటీ: చిన్నారుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని వారి తల్లి దండ్రులతో పాటు ఉపాధ్యాయులకు గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. శుక్రవారం స్థానిక భాష్యం పాఠశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో తల్లిదండ్రులు విద్యార్థులను మార్కులు, ర్యాంకులకే పరిమితం చేసి చూస్తున్నారని, అలా కాకుండా వారిని మంచి పౌరులుగా ఎదిగేలా ప్రోత్సహించాలన్నారు. తల్లిదండ్రులు వారి అభిప్రాయాలను పిల్లలపై రుద్దకుండా, అభిరుచులకు అనుగుణంగా చదివించాలని కోరారు. ప్రతి ఒక్కరు సెల్ఫోన్లకు బానిసలుగా మారుతున్నారన్నారు. ప్రతి విద్యార్థి సమయపాలన పాటించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడల వంటి ఇతర రంగాలలో కూడా రాణించాలని సూచించారు. విద్యార్థులు చదువులో వత్తిళ్ల అధిగమించేందుకు వీలుగా మెడిటేషన్ చేయాలని ఆయన సూచించారు. భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మరో నాలుగు రోజుల్లో క్రిష్ణకు నీరు

విశాలాంధ్ర - బ్యూరో కర్నూలు : కృష్ణా నదికి వరద ఉధృతి పెరగడంతో ఆల్మట్టి డ్యామ్ గేట్లు ఎత్తివేశారు. దీంతో దిగువన ఉన్న నారాయణపూర్ జలాశయంలోకి వరద చేరుకుంటోంది. శుక్రవారం నారాయణపూర్ డ్యామ్ గరిష్ఠ స్థాయికి చేరుకోనుంది. దీంతో డ్యామ్ గేట్లు ఎత్తి దిగువన జూరాలకు నీటిని విడుదల చేయనున్నారు. మరో రెండు రోజుల్లో జూరాల కూడా నిండనుంది. ఎగువన వరద వృద్ధితి పెరిగి పెద్దఎత్తున నీరు చేరుతుండటంతో మరో నాలుగు రోజుల్లో శ్రీశైలం డ్యామ్కు నీటిని విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది.

నేటి నుంచి ప్రభుత్వ హాస్టళ్ల విద్యార్థులతో ముఖాముఖి..

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఈనెల 20 నుండి ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులతో ముఖాముఖితోపాటు ప్రభుత్వ హాస్టల్లో నిద్ర కార్యక్రమాలు ఏఐఎస్ఎఫ్ ఆద్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న తెలిపారు. శుక్రవారం సీపీఐ కార్యాలయం నందు పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.సోమన్న, మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 30 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ హాస్టల్లో విద్యార్థులతో ముఖాముఖి హాస్టల్ నిద్రలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేకమైన సమస్యలు తెలుసుకొని ఈ సమస్యలు పరిష్కారం కోసం ఆగస్టు 6 వ తేదీన కర్నూలు జిల్లా కలెక్టరేట్ ముందు శాంతియుత ధర్నా నిర్వహించి విద్యార్థుల సమస్యలు ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. గత ఏడేళ్లుగా విద్యార్థులకు అందాల్సిన దుప్పట్లు, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు ఇవ్వలేదని అలాగే తొమ్మిది నెలలుగా మెస్ చార్జీలు విడుదల చెయ్యకపోవడంతో విద్యార్థులకు మెరుగైన పౌష్టికాహారం అందించడంలో వార్డెన్స్ విఫలమవుతున్నారన్నారు. విద్యార్థుల అనారోగ్యానికి గురయ్యి వాళ్ల విద్యాభ్యాసం మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ప్రభుత్వ హాస్టల్ కు సొంత భవనాలు కేటాయించాలన్నారు. డిగ్రీ ఆన్లైన్ అడ్మిషన్స్ వల్ల విద్యార్థులు కోరుకున్న కళాశాలలో సీట్లు పొందలేకపోతున్నారని కావున ఆన్లైన్ అడ్మిషన్స్ రద్దు చేయాలన్నారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల నియోజకవర్గ కేంద్రాలలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కార్యకర్తలు హాస్టల్ నిద్రలు సర్వేలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కర్నూలు నగర కోశాధికారి సి.అశోక్, నగర్ నాయకులు నవనీత్, అర్జున్, వర్ధన్ పాల్గొన్నారు.

నమాజ్ చేస్తున్న సమయంలో దాడి..

విశాలాంధ్ర-కోసిగి: మండల పరిధిలోని సాతనూరు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన నజీర్, నవాజ్లపై నమాజ్ చేస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన ముతవల్లి, అతనీ కుమారులు ముకుమ్మడిగా దాడి చేశారు. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. అదే గ్రామానికి చెందిన వక్ఫ్ బోర్డ్ మాజీ ముతవల్లీ ముల్ల కాశీం గతంలో గ్రామంలో ఉన్న వక్ఫ్ బోర్డు భూమిని తన ఆధీనంలో పెట్టుకుని సాగు చేసేవాడు. ఈ ఏడాది అధికారికంగా అదే గ్రామానికి చెందిన గ్రామస్తులు జిల్లా వక్ఫ్ బోర్డ్ కార్యాలయంలో వేలం పాటలో పాల్గొని గ్రామానికి చెందిన 20 మంది రైతులు సాగు చేసుకోవడానికి లీజుకు అధికారికంగా తీసుకున్నారు. ఈ ఏడాది భూమి తనకు రాలేదనే కక్షతో అతనీ కుమారులు ఖాజా, రైమత్ వలి, జిలాన్, అబ్దుల్లు దాడి చేశారు. వక్ఫ్ బోర్డు పొలం వేలంలో దక్కించుకునందుకు పతకం ప్రకారం నజీర్, నవాజ్పై కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన ఇద్దరిని ఆదోని ప్రభుత్వఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని బాధితులు తెలిపారు.

అనుమతుల్లేని పాఠశాలలపై చర్యలు తప్పవు..



విశాలాంధ్ర - పెద్దకడబూరు : పెద్దకడబూరు మండలంలో ప్రభుత్వ విద్యాశాఖ అనుమతి లేకుండా కొన్ని పాఠశాలలు విద్యార్థుల అడ్మిషన్లను తీసుకుం టున్నాయని ప్రజలు మండల విద్యాధికారి దృష్టికి తీసుకొచ్చారని మండల విద్యాధికారి-2 రామ్మూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కొన్ని పాఠశాలలో విద్యార్థులకు కనీస వసతులు కూడా లేవని ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. మండలంలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ పాఠశాలను నిర్వహించుటకు అనుమతి లేదన్నారు. ఎవరైనా ప్రభుత్వ రిజిస్ట్రేషన్ లేకుండా విద్యార్థుల అడ్మిషన్లను తీసుకుంటే అటువంటి పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకొని పాఠశాలను మూసివేయడం జరుగుతుందన్నారు. మండలంలో ఉన్న అన్ని ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు కనీస వసతులు కల్పించాల్సిం దేనని, వసతులు లేని పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మార్లమడికికి కొత్త బస్సు నడుపుతాం

విశాలాంధ్ర - హొళగుంద : మండలంలోని మార్లమడి గ్రామ విద్యార్థులు రోజు కాలి నడకతో జడ్పీ హైస్కూల్కు వెళుతున్నారు. బస్సులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులకు బస్సు సౌకర్యం లేదంటూ ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరంగా, ఎమ్మార్పీఎస్ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పోరాటాలు చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే బస్సు నడపాలంటూ ఆదేశించారు. శుక్రవారం ఆదోని ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ రఫీ, అసిస్టెంట్ మేనేజర్ రాఘవేంద్ర రూట్ మార్గాన్ని పరిశీలించి, గ్రామ ప్రజలతో చర్చించారు. హెడ్మాస్టర్ నజీర్ అహ్మద్తో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆదోని ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ గ్రామానికి విద్యార్థులు ప్రజల కోసం కొత్త బస్సు నడుపుతున్నామని, సద్వినియం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీరి వెంట ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరంగ, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి సతీష్, ఎమ్మార్పీఎస్, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులకు ప్రత్యేకంగా శ్రద్ధలు తీసుకోవాలి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : నగర శివారులో పెద్దపాడు రోడ్లో ఉన్న రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ కాలనీ, హోసన్న మందిరం తదితర కాలనీలో శుక్రవారం ఏఎన్ఎం సత్య కళ, ఆశ వర్కర్లు పి.తబిత, జాకీర ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. రెండ్రోజులపాటు కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వృద్ధాప్యంలో ఉన్న వారిపట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని వారు సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఏమైనా రోగాలు సంక్రమిస్తే వెంటనే డాక్టర్ సంప్రదించాలని వారు సూచించారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి : ఎస్టీయూ

విశాలాంధ్ర - మంత్రాలయం : గతంలో ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు, విడుదల చేసిన జీవోల వలన ప్రభుత్వ విద్యారంగం, ముఖ్యంగా ప్రాథమిక విద్య నిర్వీర్యం అయ్యే పరిస్థితికి చేరుకుందని, సత్వరం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే నిర్ణయాలు తీసుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మంత్రాలయం మండలంలో వివిధ పాఠ శాలలు సందర్శించి సభ్యత్వాలు స్వీకరణ కార్యక్రమం విజయవంతమైనదని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో విలీనం చేసిన 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలలో కొనసాగించాలన్నారు. ఉన్నత పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగును సమాంతర మాధ్యమంగా కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులపై పని భారాన్ని, బోధనేతర కార్యక్రమాలను తగ్గించాలని కోరారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకే వర్తింపచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ మంత్రాలయం మండలం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.భాస్కర్, జె.వీరేష్, నాయకులు నాగభూషణం, శ్రీనివాసులు, రవీంద్ర లాల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంచార్జ్‌గా సమర్థవంతమైన నాయకుడికి పట్టం కట్టండి..

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఆలూరు నియోజకవర్గం వెనుకబడి ఉందని గత ఎన్నికల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడినా ఓటమి చెందారని దానికి పార్టీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ స్వయంకృతపరాధమే అని జడ్పిటిసిల సంఘం మాజీ అధ్యక్షులు మీనాక్షి నాయుడు, మండల కన్వీనర్లు తిప్పయ్య, విజయ్ గౌడ్,అశోక్ యాదవ్, సుధాకర్, ఎంపిటిసి రజని, సీనియర్ నాయకులు శేషగిరి, మాజీ జడ్పిటిసిలు ఉచ్చీరప్ప,రామలింగారెడ్డి విష్ణు, వెంకటేశ్లు జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డికి విన్నవించారు. శుక్రవారం ఎన్నికల కౌంటింగ్ అయిన తర్వాత ఒక్క మండల కన్వీనర్ కు కూడా పోన్ కానీ కలిసి మాట్లాడిన సందర్భం లేదని అన్నారు. తన ఓటమికి టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అబాండాలు మోపడం సరికాదని అన్నారు. తన దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్క నాయకుడిని, కార్యకర్తలను కులం పేరుతో దూషించడం సభబు కాదన్నారు. ఆలూరు టీడీపీ నాయకులు,కార్యకర్తలు కేవలం చంద్రబాబు ను చూసి ఓట్లు వేశారని వీరభద్ర గౌడ్ ను చూసి కాదని అది గుర్తించుకోవాలన్నారు.అయినా ఎవరిదగ్గర కలవక పోయినా ఆలూరు ప్రజలు భారీగా ఓట్లు వేశారని తక్కువ మెజారిటీతో ఓటమి చెందారన్నారు. ఆలూరు ఇంచార్జ్ భాద్యతలు సమర్థవంతమైన నాయకుడికి పగ్గాలు కట్టబెట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటేష్ చౌదరి, ప్రవీణ్, మారుతి, జలందర్, ఉసేని, శ్రీరాం జయరాం, రామాంజ నేయులు, సతీష్, తోక వెంకటేష్, భీమా, రామారావు, వెంకటస్వామి గౌడ్, రంగడు, సురేష్, కొండా పురుషోత్తం, సర్పంచ్ యల్లప్ప, చంద్ర, ముత్యాల రెడ్డి, మస్తాన్లు పాల్గొన్నారు.

పౌరసరఫరాల గోధుమల్లో తనిఖీలు

విశాలాంధ్ర -ఆలూరు : మండల కేంద్రం లోని పౌరసరపరాల గోదాముల్లో ఆర్డిఓ రామలక్ష్మి ఆకస్మిక తనిఖీలు చేస్తూ, నిత్యావసర వస్తువులకు సంబంధించి రికార్డులు ఆమె పరిశీలించారు. నిత్యవసర ధరలు పెరుగుతుండడంతో వీటిని నియంత్రించెందుకు కొన్ని వస్తువులను రేషన్ షాపుల ద్వారా సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆగస్టు నుంచి రేషన్ కార్డు ఉన్నవారికి రాయితీపై 67 రూపాయలకే కేజీ కందిపప్పు, అరకిలో పంచదార కూడా ఇస్తారని నిత్యవసర వస్తువులను ఇచ్చేటప్పుడు తూకంలో తేడాలు వస్తే అలాంటి రేషన్ షాపులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. నియోజవర్గంలో నాలుగు మండలాలకు సంబంధించి రావలసిన బియ్యం, కందిపప్పు, పంచదార, రాగులు, మంచినూనె, ఎన్ని వచ్చాయని ఎన్ని రావాల్సి ఉన్నాయి పౌరసరఫరాల శాఖ ఆర్ఐ రఘురాం రెడ్డి అడుగుతూ డీలర్లు సరైన సమయంలో తీసుకుపోతున్నారా, లేదా ఎందుకు లేట్ తీసుకుపోతున్నారని ప్రశ్నించారు. తహశీల్దార్ చంద్రశేఖరయ్య రెవిన్యూ ఇన్స్పెక్టర్ బసవన్న గౌడ్, వీఆర్వో మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జలశక్తి అభియాన్ కేంద్ర బృందం పర్యటన

విశాలాంధ్ర -గోనెగండ్ల: జలశక్తి అభియాన్ కేంద్ర బృందం ఐఆర్ఎస్ శిత్త రంజన్ దాస్, సైన్స్ ష్టీట్ విజయ్ కేతన్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్ మౌర్య పర్యటించారు.శుక్రవారం గోనెగండ్ల మండల పరిధిలోని గాజుల దిన్నె ప్రాజెక్టును జల శక్తి అభియాన్ కేంద్ర బృందం అధికారులు,జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.మౌర్య పరిశీలించారు. జీడీపీ అధికారులతో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టు లో నీటి సామర్థ్యం, గేట్లు, నిలిచిపోయాయిన పనులు, ఆయకట్టు భూములకు నీరు అందుతుందనే విషయాలు గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఎన్ఆర్జీఎస్ పనులు పరిశీలించారు. ఏపీ మోడల్ స్కూల్ దగ్గర ఉన్న ఫారం పండు, గోనెగండ్ల లో ఉన్న చెక్ డ్యాం ను పరిశీలించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్ మౌర్య మాట్లాడుతూ ఐరన్ బండ గ్రామంలో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. జీడీపీ అధికారులు డీఈ విజయ్ కుమార్, జీడీపీ ఏఇ ముహమ్మద్ అలీ, ఎంపీడీవో సోనీ బాయ్, ఎన్ ఆర్ జీ ఎస్ అధికారులు, వెలుగు వైకేపీ ఇన్చార్జి ఏపీఎం ముక్కన్న,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పులికనుమ రిజర్వాయర్‌లో చేపల వేలం పాట

విశాలాంధ్ర-కోసిగి : గ్రామ సమీపాన ఉన్న పులికనుమ రిజర్వాయర్ లో చేపల వేలం పాటలు ఈనెల 23వ తేదీ మంగళవారం నిర్వహిస్తున్నట్లు మత్స్యశాఖ సహాయ పర్యవేక్షకులు నాగరాజు ప్రకటనలో తెలిపారు. మత్స సంపదను ఫసలి 1434 అనగా ఈనెల 1 నుండి 30 వరకు వేలం ద్వారా రిజర్వాయర్లో చేపలు పట్టుటకు లీజుకు ఇస్తామన్నారు. ఈ బహిరంగ వేలం పాటలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10:00 గంటల కు మండల నాయకులు ,అధికారుల ఆద్వర్యంలో నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనేవారు ఆదార్ కార్డుతో పాటు రూ.10 వేల డిపాజిట్ చేయలన్నారు. వేలంపాటలో అధికంగా పాడిన వారికే లీజుకు ఇస్తామన్నారు. వేలం పాటలో వెంటనే డబ్బులు చెల్లించాలన్నారు. వేలం పాట దారుడికి మత్స సంపదపై మాత్రమే అధికారం ఉంటుందని , నీటిపై ఎలాంటి అధికారం ఉండదన్నారు. చేపలు పట్టే సమయంలో తూముల నుండి, గండ్లు పెట్టి నీరు తొలగించి చేపలు పట్టరాదన్నారు. వేలంపాటలో ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే తక్కువగా వేలం వస్తే రద్దు చేస్తామన్నారు.

మృతుని కుటుంబనికి ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర - దేవనకొండ : మండల యూపీఎస్ నందు హెూంగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీనివాసులు మే 28న రాత్రి విధులు నిర్వహించుకుని తెల్లవారుజామున ఇంటికి వెళ్లిన తరువాత ఉదయం 5 గంటలకు గుండెపోటుకి గురై మరణించారు. ఆ కుటుంబానికి అండగా పోలీస్ సిబ్బంది, హెూంగార్డ్ సిబ్బంది తమ వంతు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. శుక్రవారం రూ.1.26 లక్షలను పత్తికొండ డిఎస్పి వి.శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మృతుని కుటుంబానికి అండగా నిలిచిన నంద్యాల, కర్నూలు జిల్లా నందు డ్యూటీ చేయుచున్న పోలీస్ సిబ్బంది, హెూంగార్డ్స్‌కు ధన్య వాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెూంగార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

గత 44 సంవత్సరాలుగా జిల్లాలో అత్యుత్తమ శిక్షణ ఇస్తున్న ఏకైక సంస్థ
శ్రీ సర్వోదయ ఐటిఐ
(భారత ప్రభుత్వంచే గుర్తింపు పొందిన సంస్థ)
మద్దూరు నగర్, కర్నూలు-2
ట్రేడులు: ఎలక్ట్రీషన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్,ఫిట్టర్, మోటర్ మెకానికల్
విద్యార్హత: 10వ తరగతి ఉత్తీర్ణత
కాల పరిమితి: రెండు సంవత్సరాలు
వయోపరిమితి: 14 సం॥ నుంచి 40 సం॥ వరకు
అడ్మిషన్లు జరుగుచున్నవి
సెల్: 9885771219
ప్రత్యేకతలు
- 44 సంవత్సరాలుగా అత్యాధునిక వసతులతో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నడుపుతున్న విద్యాసంస్థ • 100 శాతం ఉత్తీర్ణత • బస్సు పాస్ సౌకర్యం
• ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం, ఇతరులకు గవర్నమెంట్ ఫీజులు మాత్రమే
సేవా రత్న రోటేరియన్
వొమ్మిన సుబ్రహ్మణ్యం
అధ్యక్షులు, శ్రీ సర్వోదయ ఐటిఐ

కె. జీవరత్నం, ప్రిన్సిపాల్
శ్రీ సర్వోదయ ఐటిఐ, కర్నూలు

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 20, జూలై 2024

గ్రామాల్లో పరిశుభ్రతను పాటించండి : తహసీల్దార్

విశాలాంధ్ర - దేవనకొండ : గ్రామీణ ప్రాంతాలలో నివాస గృహాల చుట్టూ పరిశుభ్రత పాటించినప్పుడే అందరు ఆరోగ్యంగా ఉంటారని, శుక్రవారం మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో ఆరోగ్యం పరిశుభ్రత అంశంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీత ఏర్పాటు చేసిన సమావేశానికి సర్పంచ్ షేకమ్మ అధ్యక్షతన నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యం అని గ్రామంలో ప్రజలు అందరి సహకరం ఉన్నప్పుడే సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ వారివారి గృహాల చుట్టు పక్కల పరిశుభ్రతను పాటించాలన్నారు. అంతరం గ్రామ పురవీధుల్లో పర్యటించి ప్రజలకు పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భముగా గ్రామంలో నెలకొన్న సమస్యలు అదనంగా ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం, మస్తాన్ తాత ముఖద్వారం దగ్గర పారుతున్న నీటిని డ్రైనేజీ ద్వారా గ్రామ బైటకు వెళ్ళేలా చూడాలని, కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మాణం, డ్రైనేజీ కాలువలుఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న హంద్రినీవా కాలువ పనులు త్వరితగతిన చేపట్టాలని గ్రామస్థులు విన్నవించారు. ఈ సమస్యలపై ఉన్నత అధికారులకు నివేదిక పంపుతమన్నారు. అనంతరం మధ్యనబోజనాన్ని పరిశీలించి నాణ్యత పాటించాలన్నారు. గ్రామ రెవెన్యూ అధికారి ఆనంద్ కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ సలాం, సర్వేయర్ షఫీఉల్లా, గ్రామ పెద్దలు చాంద్ బాష, మద్దిలేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నూరుల్లా ఖాద్రి మస్జిద్‌లో ఎన్ఎండీ ఫిరోజ్‌కి సన్మానం

విశాలాంధ్ర - నంద్యాల : పట్టణ శివారులోని నూరుల్లా ఖాద్రీ మస్జిద్‌లో జుమ్మా నమాజ్ తర్వాత నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్‌కు సన్మానం చేయడం జరిగినది. గతంలో ఫరూక్‌కు ఎమ్మెల్యే సీటు వస్తే సహకరిస్తామని చెప్పడం, ఎన్ఎండి ఫరూక్‌కు టిడిపి పార్టీ తరవు నుంచి ఎమ్మెల్యే సీట్ రావడంతో నూరుల్లా ఖాద్రీ మసీదు పెద్దలు, ఇండియన్ యూనియన్ ముస్లిం లిగ్ పార్టీ నాయకులు ఫరూక్ కు సహకరించడం జరిగిందని, అల్లా దయవల్ల ఎన్ఎండి ఫరూక్ నంద్యాల ఎమ్మెల్యేగా గెలవడం నంద్యాల ప్రజల అందరి సహకారంతో ఎన్ఎండి ఫరూక్ మైనారిటీ, న్యాయ శాఖ మంత్రిగా అధికారం చేపట్టడం జరిగిందన్నారు. ఈ సంతోషంలో నూరుల్లా ఖాద్రీ మసీదులో ఒక పండుగలా జరుపుకొని అందరికీ భోజనాలు ఏర్పాటు చేయడం జరిగిందని, మసీదు కమిటీ నిర్వాహకులు మౌలానా అబ్దుల్ సలాం తెలిపారు. ఈ సందర్భంగా నూరుల్లా ఖాద్రీ మసీదు పెద్దలు మాట్లాడుతూ ఎన్ఎండి ఫిరోజ్ టిడిపి పార్టీ అధికారంలో రావడానికి చాలా కష్టపడ్డారని, ఈరోజు ఈ గెలుపు ఫిరోజ్ దేనని భావించి పెద్దలు ఎన్ఎండి ఫిరోజ్‌కు సన్మానించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ప్రజలందరి సహకారంతో ఫరూక్ కు టికెట్ రావడం, ఎమ్మెల్యేగా గెలవడం, అదే విధంగా మంత్రి కావడం చాలా సంతోషంగా ఉందని, నంద్యాలకు ఏ ఏ హామీలు ఇచ్చామో అవన్నీ అమలు చేస్తామని, ప్రజలందరికీ సహకరిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మౌలానా రఫీవుద్దిన్, మౌలానా అబ్దుల్ సలాం, అర్షద్ హుస్సేన్, మనియార్ ఖలీల్, జియా, అమీర్, రహిమాన్, 6 వార్డు టిడిపి ఇంచార్జ్ పల్లె సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు

విశాలాంధ్ర - చిప్పగిరి: గ్రామాలలోని అర్హులైన ప్రతి ఒక్కరికి జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఉపాధి పనులు కల్పించడం జరుగుతుందని ఉపాధి హామీ పథకం మండల ఏపీవో మాధవ శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన చిప్పగిరి మండల పరిషత్ ఉపాధి కార్యాలయము నందు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమావేశమును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం కింద అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించడం జరుగుతుందన్నారు. ఉపాధి పనులలో ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడిన అట్టి వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పథకంలో భాగంగా గృహ నిర్మాణ పథకం కింద గృహ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు ఒక్కొక్క గృహమునకు రూ. 27,200 నిధులు చెల్లించవలసి ఉంటుందని, ఇందుకు సంబంధించిన మాస్టర్లను ఎప్పటికప్పుడు తయారు చేయాలన్నారు. ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లకు, టెక్నికల్ అసిస్టెంట్లకు, గృహ నిర్మాణ అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ కృష్ణ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు..

సీజనల్ వ్యాధులు ప్రభలకుండా చర్యలు చేపట్టాలి

విశాలాంధ్రు - హెూళగుంద : మండలంలో సీజన్ వ్యాధులు ప్రబలకుండా అధికారులందరూ చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ కల్లుముడి ఆజాద్ కోరారు ఎండిఓ కార్యాలయంలో శుక్రవారం సీజనల్ వ్యాధుల నిర్మూలన అవగాహన కార్యక్రమం జరిగింది అవగాహన కార్యక్రమంలో ఎం పీ డి ఓ కల్లు మడి ఆజాద్ మాట్లాడుతూ ప్రజలకు అతి సార, డెంగు, మలేరియా వ్యాధులు శోకకుండా చూడాలని గ్రామంలో ఎక్కడబడితే అక్కడ చెత్త చెదారం లేకుండా చూడాలని పారిశుద్ధ్యంలోపిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు కలుషిత నీరు సరఫర కాకుండా దోమలు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు. డ్రైనేజీలో శుభ్రపరిచి చెత్తాచెదారాన్ని ఎత్తివేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు .దోమలనిర్మూలనకు ప్రజలకు అవగాహన కల్పించాలని ,అతిసార సోకిన వారిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని పేర్కొన్నారు .అతి సారా పట్ల ప్రజలు నిర్లక్ష్యంగా ఉండకూడదు అని విజ్ఞప్తి చేశారు .ఈ అవగాహన కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ న్యూటన్, డాక్టర్ రాధా, ఈఓఆర్‌డి చంద్రమౌళీశ్వర గౌడ్, గ్రామ కార్యదర్శులు రాజ శేఖర్ గౌడ్, షఫీ, నాగరాజు, రాజ్ కుమార్ సచివాలయం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిపక్షం మనకు కొత్తేమి కాదు

విశాలాంధ్ర - మంత్రాలయం: ప్రతిపక్షం కొత్తేమి కాదని తాను, తన కుటుంబ సభ్యులు ఉన్నంత వరకు ఎవరూ భయపడాల్సిన పని లేదని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాంపురం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణ మండపంలో మంత్రాలయం మండలంలోని వైసీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గృహ సారధులు, సచివాలయ కన్వీనర్లు, ముఖ్య నాయకులతో పెద్దాయన వై.సీతారామిరెడ్డి అధ్యక్షతన వైసీపీ నేతలు జి.భీమారెడ్డి, సివి విశ్వనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం టీడీపీ అభ్యర్థులు గెలిస్తే నియోజకవర్గంలోని దేవుళు , ప్రజలు, మీ అందరి ఆశీస్సులతో నాల్గవ సారీ ఎమ్మెల్యేగా గెలిపించిన అందరికీ రుణ పడి ఉంటానన్నారు. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్వాడీ, ఆశా వర్కర్లను టార్గెట్ చేసి మళ్ళీ తొలగించాలని ప్రయత్నిస్తున్నారు. తాను ఉన్నంత సేపు రెగ్యులర్ రేషన్ డీలర్లు ఎవరూ కూడా అధైర్య పడొద్దని, ఎవరైనా దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో అందరికీ మంచి చేశారని, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి రాష్ట్రంలో వైస్సార్సీపీ శ్రేణులే లక్ష్యంగా దాడులు చేస్తున్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ సమన్వయంతో కలిసి కట్టుగా ముందుకు వెళ్లాలని సూచించారు.

ఇంచార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన షావలి ఖాన్

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఇంచార్జి వీసిగా ప్రొఫెసర్ పిఎస్ షా వలి ఖాన్ శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రస్తుతం కడపలోని యోగి వేమన యూనివర్సిటీలో బాటని విభాగం అధిపతిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను విజయవంతంగా నిర్వహిస్తానన్నారు.

కష్టపడితే మంచి ఫలితాలు సాధించొచ్చు..

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కష్టపడితే ఏ రంగంలోనైనా మంచి ఫలితాలు సాధించవచ్చని బస్తిపాటి నాగరాజు అన్నారు. నగరంలోని కేవీఆర్ ప్రభుత్వ బాలికల కళాశాల, టౌన్ మోడల్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన ఉచిత నోట్ బుక్కులు, బ్యాగుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, విద్యార్థులకు బుక్కులు, బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదువుకున్న తాను ఎంతో కష్టపడి ఎంపీని అయ్యానని, లక్ష్యాన్ని ఎంచుకొని వాటిని సాధించేందుకు శ్రమించాలన్నారు. ఇక బాగా చదువుకొని జన్మనిచ్చిన తల్లిదండ్రులు, చదువు చెప్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీఆర్, టౌన్ మోడల్ కళాశాలల ప్రిన్సిపాళ్లు లాలేప్ప, సుంకన్నలతోపాటు లెక్చరర్లు పాల్గొన్నారు..

ఘనంగా మాండ్ర పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - నందికొట్కూరు: నందికొట్కూరు మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో శుక్రవారం టిడిపి నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి పుట్టినరోజు వేడుకలను నియోజకవర్గ టిడిపి నాయకులు కార్యకర్తలు ముఖ్యంగా ఏబీఎం పాలెంకు చెందిన నిమ్మకాయల మోహన్, 22వ వార్డు ఇన్చార్జ్ కళాకార్ ఆధ్వర్యంలో కాలనీవాసులు స్థానిక మాండ్ర శివానందరెడ్డి స్వ గృహంలో కేక్ కట్ చేసి, పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. కాటే పోగు నాగ సురేష్, ప్రమోద్, కుమార్ రాజా, సన్నీ, మహేష్, బొల్లెద్దుల సామేలు, ప్రేమ్ కుమార్, కళ్యాణ్, లాలు, నవీన్, ప్రవీణ్, గంధం సురేష్, డేవిడ్ పాల్గొన్నారు.

మండలంలో భారీ వర్షం

విశాలాంధ్ర - బనగానపల్లె: పట్టణం, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. దీంతో పొలాలు పదును కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది రోజుల నుంచి మిరప విత్తనం వేసేందుకు మండల వ్యాప్తంగా అన్నదాతలు ఎదురు చూశారు. గత వారం నుంచి ఆకాశం మేఘావృతమై చిరుజల్లులకే పరిమితం కావడంతో అన్నదాతలు తీవ్ర నిరాశ చెందారు. ఎట్టకేలకు శుక్రవారం భారీ వర్షం పడడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేశారు. కాగా మధ్యాహ్నం నుంచి వర్షం ప్రారంభం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురై ఇళ్లకే పరిమితం అయ్యారు.

అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలి

విశాలాంధ్ర -కల్లూరు : కర్నూలు' కల్లూరు సబ్ రిజిస్టర్ కార్యాలయాలు అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, బాధితుడు అన్నయ్య, జిల్లా కార్యదర్శి అబ్దుల్లాలు ఆరోపించారు. శుక్రవారం రిజిస్టర్ కార్యాలయం ముందు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ మాట్లాడుతూ 1982వ సంవత్సరం ప్రెస్ లో పని చేస్తున్నందుకు ప్రభుత్వం ఆనాడు మూడు సెంట్ల స్థలాన్ని సర్వే నంబర్ 19/136 337 లో ప్లాట్ నెంబర్ 48నీ ఆర్.ఏ పెద్దయ్యకు ఇచ్చారు. ఆర్.ఏ పెద్దయ్య 1986లో చనిపోయారు. అనంతరం వారి కుమారులు స్థలంలో పునాదులు వేసుకొని గుడిసె నిర్మించుకున్నారు. 2022 డిసెంబర్ 19వ తేదీ 19304/2022 డాక్యుమెంట్ నంబర్తో ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమార్కులకు కర్నూలు సబ్ రిజిస్టర్ 1 చైతన్య రాయులు అక్రమ రిజిస్ట్రేషన్ చేశారు. విషయం తెలుసుకున్న బాధితులు జిల్లా రిజిస్టర్కు కంప్లైంట్ చేస్తే మళ్లీ తిరిగి అదే స్థలాన్ని సబ్ రిజిస్టర్ ప్రవీణ్ కుమార్ 2023 ఫిబ్రవరి 16వ తేదీ డాక్యుమెంట్ నెంబర్ 2401/2023 ఫేక్ డాక్యుమెంట్ లతో, అలాగే తహశీల్దార్ వెంకటేష్ నాయక్ పేరుతో ఒక ఫేక్ జెన్యూన్ సర్టిఫికెట్గా చూయించి మరోసారి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు. ఈ విషయం పైన బాధితుడు స్పందనలో కంప్లైంట్ ఇస్తే జిల్లా రిజిస్టర్ కు సంబంధిత రిజిస్ట్రేషన్ లపై విచారణ చేయాలని ఆదేశించారు. జిల్లా రిజిస్టర్ ఉద్దేశపూర్వకంగా ఫేక్ సర్టిఫికెట్లతో అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న అక్రమార్కులను, ఫేక్ సర్టిఫికెట్లతో రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్టర్ లను కాపాడడానికి బాధితుడిని జెన్యూన్ సర్టిఫికెట్ తీసుకురావాలంటూ ఇబ్బంది పెడుతున్నాడు. తహశీల్దార్ కార్యాలయం నుండి 24 .01/2023 సంబంధించినవి ఫేక్ సర్టిఫికెట్లని నిర్ధారించినవి, ప్లాట్ నంబర్ 45 పెద్దయ్యకు కేటాయించినట్లు తహశీల్దార్ ఇచ్చిన లిస్టు, ఫీల్డ్ లో పెద్దయ్య వారసులు ఉన్నట్లు సర్వేర్ ఇచ్చిన రిపోర్టును సబ్మిట్ చేసిన అక్రమార్కుల నుండి మామూలు వసూలు చేసి జిల్లా రిజిస్టర్ ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, రైతు సంఘం నాయకులు దస్తగిరి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, నగర అధ్యక్ష కార్యదర్శులు గౌతమ్, హుస్సేన్ బాష, నగర నాయకులు మహేష్, శివశంకర్, జిల్లా నాయకులు శంకర్, బాధితుడి మిత్రులు మద్దిలేటి, సజీవరావు, భాస్కరు, రాజు తదితరులు పాల్గొన్నారు.

నాగనాథనహళ్లిలో కాంగ్రెస్ నాయకుల పర్యటన

విశాలాంధ్ర - ఆదోని రూరల్: టిడిపి ప్రభుత్వంలో దళితులపై భౌతిక దాడులు హత్య రాజకీయాలు రోజురోజుకు పెచ్చిమిరి పోతున్నాయని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ సాకే శంకర్, జిల్లా అధ్యక్షులు బాబు రావు, మాజీ మంత్రి మూలింటి మారెప్ప ప్రభుత్వ తీరుపై ఆగ్రహ వ్యక్తం చేశారు. మండలంలోని నాగనాథనహళ్లి గ్రామంలో దళిత మహిళ గుండమ్మపై టిడిపి నాయకుల చేతిలో హత్య గురైన ఘటనపై రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలారెడ్డి తీవ్రంగా ఖండించారని, అందులో భాగంగా నాగనాథ నహళ్లి గ్రామంలో పర్యటించి బాధిత మహిళ కుటుంబాన్ని పరామర్శించారు.సాకే శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎస్సిలపై దాడులు ఎక్కువగా జరిగాయని, టీడీపీ ప్రభుత్వం ఏర్పాటై 50 రోజులకే రాష్ట్రంలో హత్య రాజకీయాలు ఎక్కువయ్యాయని మండిపడ్డారు. గుండమ్మ కుటుంబంపై అగ్రవర్ణ వ్యక్తుల దాడి చేస్తే ఇప్పటికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని ప్రశ్నించారు. ఇప్పటికి ఆదోని నియోజకవర్గ ఎమ్మెల్యే బాధిత కుటుంబ ఇంటిని సందర్శించలేదని విచారం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షులు బాబు రావు మాట్లాడుతూ గుండమ్మ తనకు గత 20 సంవత్సరాలుగా పరిచతురాలని ఆమెను అగ్రవర్ణ వ్యక్తులు హత్య చేయడం ఎంతో బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. పొలం తగాధలో పెద్దల సమక్షంలో మాట్లాడితే సరిపోయేదాన్ని ఇలా హత్యలు చేసే దాక రావడం తగదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బాధిత కుటుంబాన్ని కలిసి వారికి ప్రభుత్వంచే రావలసిన నష్ట పరిహారాన్ని సత్వరమే మంజూరయ్యేలా చేయాలని డిమాండ్ చేశారు. గుండమ్మ కొడుకుకి ప్రభుత్వ ఉద్యోగం 5 ఎకరాల పొలం, ఇల్లు, 50 లక్షలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుండమ్మ హత్యలో ప్రధాన ప్రత్యక్ష సాక్షి ఆమె కొడుకు కిషోర్ కి పోలీస్ వారి రక్షణ ఇవ్వాలని కోరుతున్నాము. తక్షణ చర్యలు చేపట్టాలి లేనిచో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర మరియు జాతీయ ఎస్సి, ఎస్టీ కమిషన్‌ను కలుస్తామని హెచ్చరించారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళతామన్నారు. మాజీ మంత్రి మారెప్ప, ఆదోని నియోజకవర్గం ఇంచార్జ్ రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి..

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: విద్యుత్ వినియోగంలో భద్రతా ప్రమాణాలు పాటించడం ద్వారా ప్రజలు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రక్షించుకోవచ్చని ఏపీఎస్పీడీసీఎల్ కర్నూల్ ఆపరేషన్ సర్కిల్ ఎస్ ఈ ఉమాపతి అన్నారు. శుక్రవారం ఆయన కర్నూలు విద్యుత్ భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గృహ వినియోగదారులు, రైతు కూలీలు, వ్యవసాయదారులు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలు తీసుకోవాల్సిన విద్యుత్ జాగ్రత్తలను గురించి వివరించారు. ఐఎస్ఐ గుర్తు ఉన్న నాణ్యమైన విద్యుత్ పరికరాలను మాత్రమే వినియోగించాలని, ఎర్తింగ్ చేయాలని, ప్లగ్ సాకెట్స్ పిల్లలకు అందుబాటులో లేకుండా చూసుకోవాలని కోరారు. తడి చేతులతో విద్యుత్ ఉపకరణాలను ఉపయోగించవద్దని, తాకవద్దని అలాగే తడి బట్టలను ఎలక్ట్రిక్ వైర్, సపోర్ట్ తీగలపై వేలాడ తీయవద్దని తదితర భద్రత అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఆయన చెప్పారు.

వివాహిత ఆత్మహత్య.. కేసు నమోదు

విశాలాంధ్ర -కర్నూలు క్రైం : నగరంలోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వివహిత మనీషా (23)ఫ్యాన్‌కు ఉరిసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ మురలీధర్ రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గత నాలుగు సంవత్సరముల కిందట మృతురాలు మనీషా తన భర్త సురేష్ కుమార్‌తో ప్రేమ వివాహము చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మృతురాలు తన భర్తకు రెండవ భార్య ఆమె భర్త సురేష్ కుమార్, పెళ్లి కార్యక్రమాలలో ఈవెంట్ మ్యూజిక్ డాన్సర్స్ గా పనిచేస్తూ జీవనము చేస్తుట్లు ఆయన తెలిపారు. ఈ మధ్య కాలములో సురేష్ కుమార్ డాన్స్ గ్రూప్ లో వున్న వేరే ఆమెతో చనువుగా ఉంటున్నాడని ఈ విషయములో మృతురాలు ఆమె భర్త సురేష్ కుమార్ తరచూ గొడవ పడేవారని తెలిపారు. తన భర్త ప్రవర్తనలో మార్పు రానందున మనస్తాపము చెంది, గురువారం సాయంత్రం తన ఇంట్లో బెడ్ రూమ్ లో ఉన్న ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలు తల్లి కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ కాలేజీ అధ్యాపకులకు ఘనంగా వీడ్కోలు

విశాలాంధ్ర - హెూళగుంద : హెూళగుంద ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కెమిస్ట్రీ అధ్యాపకులుగా పనిచేస్తున్న డేవిడ్ కౌతాళం ప్రభుత్వ జూనియర్ కాలేజ్ కు బదిలీ అయ్యారు. ఫిజిక్స్ అధ్యాపకులు శుభాన్ బాష వెల్దుర్తి ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌కు బదిలీ అయ్యారు. నూతనంగా ప్రిన్సిపాల్ పదవీ బాధ్యతలు చేపట్టిన కే ప్రవీణాకు శుక్రవారం అధ్యాపకులు సిబ్బంది శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన అధ్యాపకులు విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు చెన్నబసయ్య, శశి కుమార్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండండి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: వర్షాలు పడుతున్నందున విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌పై అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో రూరల్ ఏఈ చెన్నయ్య శుక్రవారం మీడియాకు తెలియజేశారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడితే సంబంధిత లైన్మెన్ కు సమాచారం ఇవ్వాలని కోరారు. విద్యుత్ ప్రజలు జాగ్రత్తలో ఎంతైనా అవసరం అన్నారు. ముఖ్యంగా రైతులు బోరు బావుల దగ్గర స్టార్టర్లను ఆన్-ఆఫ్ చేసేటప్పుడు చేతితో కాకుండా తడి లేని ఒట్టి కట్టెపుల్లను వినియోగించాలని తెలియజేశారు.

మరో నాలుగు రోజుల్లో క్రిష్ణకు నీరు

విశాలాంధ్ర - బ్యూరో కర్నూలు : కృష్ణా నదికి వరద ఉధృతి పెరగడంతో ఆల్మట్టి డ్యామ్ గేట్లు ఎత్తివేశారు. దీంతో దిగువన ఉన్న నారాయణపూర్ జలాశయంలోకి వరద చేరుకుంటోంది. శుక్రవారం నారాయణపూర్ డ్యామ్ గరిష్ఠ స్థాయికి చేరుకోనుంది. దీంతో డ్యామ్ గేట్లు ఎత్తి దిగువన జూరాలకు నీటిని విడుదల చేయనున్నారు. మరో రెండు రోజుల్లో జూరాల కూడా నిండనుంది. ఎగువన వరద వృద్ధితి పెరిగి పెద్దఎత్తున నీరు చేరుతుండటంతో మరో నాలుగు రోజుల్లో శ్రీశైలం డ్యామ్‌కు నీటిని విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది.

ఆకస్మిక తనిఖీ..

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని పెద్దవంగలి గ్రామమునందు జరుగు కుష్టువ్యాధి సర్వే కార్యక్రమాన్ని వైద్యాధికారిణి తస్లీమా సుల్తానా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. కుష్టు వ్యాధి సర్వేపై ఆశా కార్యకర్తలు, మేల్ వాలంటీరులకు తగు సూచనలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుండి 9 గంటల లోపు సర్వే చేయాలన్నారు. స్త్రీలకు ఆశా కార్యకర్త వాలంటీర్ తల నుండి పాదముల వరకు శరీరం లోని ప్రతిభాగమును క్షుణ్ణంగా పరిశీలించి ఏదైనా స్పర్శలేని మచ్చలుంటే వారిని గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు పంపడం జరుగు తుందన్నారు. అక్కడ పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే మందులను ఇప్పించి పంపడం జరుగుతుందన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ మనోహర్,సిహెచ్ఓ కవిత,ఏఎన్ఎం భూదేవి, ఆశ కార్యకర్తలు రజని, పద్మావతిలు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర - చాగలమర్రి : చాగలమర్రి పట్టణంలోని 3వ రైతు సేవ కేంద్రం నందు మండల వ్యవసాయ అధికారి రంగ నేతాజి డిటి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఓ మాట్లాడుతూ కౌలుకు పంటలు సాగుచేస్తున్న రైతులు ప్రతి ఒక్కరు పంట సాగు హక్కు పత్రాలు తీసుకోవాలని వీటి వలన కౌలు రైతులకు ప్రకృతి వైపరిత్యాలు జరిగినప్పుడు పంట నష్ట పరిహారం, పంటల భీమా, కొనుగోలు సమయంలో ధాన్యం సేకరణకు కౌలు కార్డులు అవసరమని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

విశాలాంధ్ర - ఆలూరు : ప్రపంచంలో ప్యారిస్ ఒలంపిక్స్ క్రీడలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ నెల 26న ప్రారంభం కానున్నాయి. ఈసారి ఎన్నో కొత్త అంశాలను పారిస్ వేదికగా కాబోతున్నది. ఈసారి ఈ క్రీడల్లో మహిళలు, పురుషులు సమానత్వం ఉండబోతుంది. ఏపీ మోడల్ స్కూల్ నుండి వంద మంది విద్యార్థులు పాల్గొనగా, వారిలో 17 మంది ఈ ఒలంపిక్స్ పరీక్షలలో బంగార పథకాలు సాధించారని మోడల్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు రాఘవేంద్ర తెలిపారు. ఈ పతకాలు సాధించిన విద్యార్థుల్లో ఎం.శ్యాంప్రకాష్ రెండు బంగారు పతకాలు సాధించాడు. ఒకటి ఇంగ్లీషు రెండు మాథ్స్ మిగతా విద్యార్థులు ఆయా సబ్జెక్టులపై ఒక్కొక్కటి బంగారు పతకంతో పాటు సిల్వ్ సాధించాలన్నారు. అధ్యాపకుడు వీరేశప్ప, వ్యాయామ ఉపాధ్యాయుడు ఈరన్న, ఉపాధ్యాయులు, ఈ పథకాలు సాధించిన విద్యార్థులు పాల్గొన్నారు.